# వాస్తవం
డెయిలీ.కామ్
ఉన్నది ఉన్నట్లుగా
డిజిటల్ పత్రిక
బుధవారం 22.04.2026
ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## అభిషేక్ బ్యాటుతో, మలింగ బంతితో

### ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హ్యాట్రిక్



సొంతగడ్డపై వరసగా మూడో మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్) సుడిగాలి శతకం తో ఢిల్లీ క్యాపిటల్స్‌పై మానసికంగా పైచేయి సాధిచిన హైదరాబాద్.. ఇషాన్ మలింగ(4-32) విజృంభణతో ఘన విజయం సాధించింది.

10లో..

# మాటల తూటాలు

## జగిత్యాలలో కేసీఆర్ గర్జన
## పార్టీ క్యాడర్,నేతల్లో ఉత్సాహం
## రేవంత్ సర్కార్‌ని చీల్చిచెండాడిన గులాబీ బాస్
## రేవంత్ అవే శపథాలు..అవే తప్పిదాలు
## బీఆర్ఎస్‌కి అధికారాన్ని దగ్గర చేసే వైఫల్యాలు

సోమవారం తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి.ఓ వైపు భూపాలపల్లి జిల్లాలో సీఎం రేవంత్,మరోవైపు జగిత్యాల జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ సభలు జనంలో ఆసక్తిని రేకెత్తించాయి.పోటాపోటీ సభల్లో ఇద్దరు నేతలు ఏం మాట్లాడుతరనే ఆసక్తి  సర్వత్రా నెలకొనడాన్ని చూశాం.



కె.ఆర్ ఉన్నమాట

2

కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీకి బలం.కేసీఆర్‌ని పదేపదే విమర్శిస్తూ రెచ్చగొడితే కాంగ్రెస్ పార్టీకే నష్టం. ఇప్పుడు రేవంత్ రెడ్డి చేస్తున్నది అదే.పదేపదే కేసీఆర్ మీద అనుచిత విమర్శలు, చావు భాష వాడటం కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నాశనం చేసేవే.అయితే కాంగ్రెస్ నాశనం అయితే రేవంత్‌కి ఏంటి? పార్టీ రేపు అధికారంలోకి రాకున్నా ఆయనకు కల్గే నష్టమేమీ ఉండకపోవచ్చు.సీఎం కావాలనే ఆశ నెరవేరింది.కాంగ్రెస్ సిద్ధాంతాలతోనే రాజకీయాలు చేసిన వ్యక్తి రేవంత్ కాదు.పార్టీ ఫిరాయింపులు ఆయనకు కొత్తేమీ కాదు.దాదాపు అన్ని పార్టీలు మారిన రేవంత్ రేపటిరోజున కమలం చెంతకు చేరడనే గ్యారెంటీ లేదు.ఆయనకు కావాల్సింది తనని జైలుపాలుచేసిన కేసీఆర్‌ని జైలుకు పంపించాలి.తనని ఇబ్బందిపెట్టిన పార్టీని అధికారంలోకి రాకుండా చేయాలి? ఈ క్రమంలో పార్టీ నష్టపోయినా,తను నష్టపోయినా పర్వాలేదని ఆయనే స్వయంగా గతంలో అన్నారు.అంటే బీఆర్ఎస్‌ని అధికారంలోకి రాకుండా చేయడానికి   ఏ ద్వారమైనా తెరుస్తా  అనే వాదంలోనే రేవంత్ ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి.

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఏప్రిల్ 21:**

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకే చోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది.భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.



### అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్'లో

# పెట్టుబడుల్ని ప్రోత్సహించండి

**తెలంగాణ అత్యంత అనుకూలం...**
**అవకాశాలు పుష్కలం**
**ఇటలీ రాయబారికి**
**మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి**



**వాస్తవం:హైదరాబాద్:** అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధులను ఆయన కోరారు. ఇటలీ దేశ రాయబారి 'ఆంటోనియో బార్టోలి' నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా.... ఏయే రంగాల్లో 'తెలంగాణ -- ఇటలీ' కలిసి పని చేసేందుకు అవకాశాలున్నాయనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. నేడు ఐరోపాలోనే అత్యంత బలమైన ఎగుమతి ఆధారిత, ఉత్పాదక రంగం కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇటలీ కొనసాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మెషీనరీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమోటివ్ సిస్టమ్స్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను గ్లోబల్ 'మ్యానుఫ్యాక్చరింగ్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, అనుసరిస్తున్న వ్యూహాలను, పాలసీలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'భారత్ -- ఇటలీ' మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రీ 4.0, రోబోటిక్స్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, క్లీన్ మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో ఇటలీ మార్గదర్శకం 'తెలంగాణ బ్రాండ్'ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీకి నమ్మకమైన భాగస్వామిగా ఉండేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. 'తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టం' మరింత బలోపేతమయ్యేలా టీ హబ్, వీ హబ్, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్కు, యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలతో ఇటలీ కంపెనీలు, నిపుణులు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చొరవ చూపాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. 'ఈ సమావేశం తొలి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో తెలంగాణకు నమ్మకమైన భాగస్వామిగా మారుతాం. కీలక రంగాల్లో కలిసి పని చేస్తాం. ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం' అని ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి పేర్కొన్నారు.

# రేవంత్‌వి చిల్లర మాటలు

**కేసీఆర్ పుణ్యం వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు..**
**కేసీఆర్ జగిత్యాల సభ గ్రాండ్ సక్సెస్**
**అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే**
**విద్యా వ్యవస్థను నాశనం చేసింది రేవంత్ ప్రభుత్వమే**
**రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తు**
**జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



**జగిత్యాల:** కేసీఆర్ జగిత్యాల సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని సీనియర్ నేత జీవన్ రెడ్డి తెలిపారు. మార్పు జరిగితే మంచి కోసమే జరగాలని అన్నారు. రైతుబంధును సీఎం రేవంత్ రెడ్డి మూడుసార్లు ఎగ్గొట్టారని మండిపడ్డారు. మహిళలకు రూ.2500 ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని అన్నారు. జగిత్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను నాశనం చేసింది రేవంత్ ప్రభుత్వమే అని అన్నారు. విద్యా శాఖపై సీఎం రేవంత్ ఒక్క రివ్యూ కూడా చేయలేదని తెలిపారు. సీఎం హోదాలో ఉండి రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ సభ సక్సెస్ జీర్ణించుకోలేక రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అన్నారు.నిన్నటి బీఆర్ఎస్ సభ తెలంగాణ ఉద్యమాన్ని తలపించిందని జీవన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పుణ్యం వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని వ్యాఖ్యానించారు. అలాంటి ఆయన్ను పట్టుకుని ఉరితీస్తాను అంటావా అని మండిపడ్డారు. ప్రజాపాలన నెపంతో కాంగ్రెస్ ప్రజలను వంచిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని

(మిగతా10లో..)

వాస్తవం



# మాటల తూటాలు

## జగిత్యాలలో కేసీఆర్ గర్జన

## పార్టీ క్యాడర్,నేతల్లో ఉత్సాహం

## రేవంత్ సర్కార్‌ని చీల్చిచెండాడిన గులాబీ బాస్

## రేవంత్ అవే శపథాలు..అవే తప్పిదాలు

## బీఆర్ఎస్‌కి అధికారాన్ని దగ్గర చేసే వైఫల్యాలు

**సోమవారం తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి.ఓ వైపు భూపాలపల్లి జిల్లాలో సీఎం రేవంత్,మరోవైపు జగిత్యాల జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ సభలు జనంలో ఆసక్తిని రేకెత్తించాయి.పోటాపోటీ సభల్లో ఇద్దరు నేతలు ఏం మాట్లాడుతరనే ఆసక్తి సర్వత్రా నెలకొనడాన్ని చూశాం.**

**కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీకి బలం.కేసీఆర్‌ని పదేపదే విమర్శిస్తూ రెచ్చగొడితే కాంగ్రెస్ పార్టీకే నష్టం. ఇప్పుడు రేవంత్ రెడ్డి చేస్తున్నది అదే.పదేపదే కేసీఆర్ మీద అనుచిత విమర్శలు, చావు భాష వాడటం కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నాశనం చేసేవే.అయితే కాంగ్రెస్ నాశనం అయితే రేవంత్‌కి ఏంటి? పార్టీ రేపు అధికారంలోకి రాకున్నా ఆయనకు కల్గే నష్టమేమీ ఉండకపోవచ్చు.సీఎం కావాలనే ఆశ నెరవేరింది.కాంగ్రెస్ సిద్ధాంతాలతోనే రాజకీయాలు చేసిన వ్యక్తి రేవంత్ కాదు.పార్టీ ఫిరాయింపులు ఆయనకు కొత్తేమీ కాదు.దాదాపు అన్ని పార్టీలు మారిన రేవంత్ రేపటిరోజున కమలం చెంతకు చేరడనే గ్యారెంటీ లేదు.ఆయనకు కావాల్సింది తనని జైలుపాలుచేసిన కేసీఆర్‌ని జైలుకు పంపించాలి.తనని ఇబ్బందిపెట్టిన పార్టీని అధికారంలోకి రాకుండా చేయాలి? ఈ క్రమంలో పార్టీ నష్టపోయినా,తను నష్టపోయినా పర్వాలేదని ఆయనే స్వయంగా గతంలో అన్నారు.**




సోమవారం తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి.ఓ వైపు భూపాలపల్లి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి ,మరోవైపు జగిత్యాల జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ సభలు జనంలో ఆసక్తిని రేకెత్తించాయి.పోటాపోటీ సభల్లో ఇద్దరు నేతలు ఏం మాట్లాడుతరనే ఆసక్తి సర్వత్రా నెలకొనడాన్ని చూశాం. పాపాల భైరవుడు కేసీఆర్... ఆ దరిద్రుడు పేదలకు ఇళ్లు ఇవ్వలేదు. కానీ, ఆయనో ఫాంహౌజ్.. కొడుకో ఫాంహౌజ్.. అల్లుడో ఫాంహౌజ్.. బిడ్డో ఫాంహౌజ్ మాత్రం కట్టుకున్నారు. వాస్తు మంచిగ లేదని ప్రగతి భవన్, సచివాలయం కట్టాడు. వచ్చే ఎన్నికల్లో నువ్వో నేనో చూసుకుందాం కేసీఆర్! ప్రజా పాలనా.. పాపాల భైరవుడా!? రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు ఇప్పుడున్న ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేయకపోతే నా పేరు మార్చుకుంటా” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. కేసీఆర్ చేసిన పాపాలకు ఇదే ఆటవిక రాజ్యమైతే.. అడవిలో ఆయనను చెట్టుకు ఉరేసినా తప్పు లేకుండా పోయేదని మండిపడ్డారు. నిజాం సర్కార్లో అయితే కేసీఆర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టేవారన్నారని భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తురుపల్లిలో సోమవారం జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అన్న మాటలు ఇవి.రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై చేసిన విమర్శలు ప్రతిసారీ శృతి మించుతూనే ఉంటాయి.ఈ విమర్శలే రేవంత్ రాజకీయాన్ని పూర్తిగా దిగజార్చుతున్నాయనే అభిప్రాయం ఉంది. ఒకరకంగా చెప్పాలంటే సోమవారం నాటి సభలో రేవంత్ రెడ్డి ప్రసంగం చూస్తే కేసీఆర్ భయం రేవంత్‌లో ఇంకా ఉందనే అనుమానం వస్తోంది.ప్రభుత్వం చేసిన మంచి పనులను చెప్పుకోవడానికి కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుని ఆ విషయం మర్చి మాజీ సీఎం కేసీఆర్‌ని దూషిస్తే విషయం అంతా పక్కదారిపడుతోంది.గతంలో ఇలా చాలాసార్లు జరిగింది.సోమవారం రెండోవిడత రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా రేవంత్ చేసిన ప్రసంగం మళ్లీ అట్లనే ఉంది.అసలు కేసీఆర్ సభ రోజే సీఎం రేవంత్ రెడ్డి సభ పెట్టుకోవడం అతి పెద్ద రాజకీయ తప్పిదం.కేసీఆర్‌ని చూసి రేవంత్ జడుసుకునే ఈ సభను పెట్టుకున్నారనే సంకేతాలు జనంలోకి వెళ్ళాయి.అనుకున్నట్లే కేసీఆర్ సభను చూసే రేవంత్ రైతు భరోసా నిధులు విడుదల చేసిండనే ఆరోపణలు వచ్చాయి.కేసీఆర్ నోటి వెంట కూడా ఇదే వచ్చింది. రైతు భరోసా నిధులు విడుదల కావాలంటే కేసీఆర్ సభ పెట్టాల్నా ఏంది? అని కేసీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించడం చూశాం. అయితే కేసీఆర్ మీద రేవంత్ చేసిన వ్యాఖ్యలు చెట్టుకు కట్టేసి ఉరేయాలి..ప్రతిపక్ష హోదా దక్కనీయ.. అలా చేయకపోతే నా పేరు మార్చుకుంటా.. మళ్లీ నేనే సీఎం ..ఇలా రేవంత్ రెడ్డి ప్రసంగంలో కొన్ని వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి.కేరింతలు కొట్టేలా చేశాయి.అయితే మళ్లీ నేనే సీఎం అనే పదం రేవంత్ రెడ్డి మరోసారి వాడటం చూశాం.ఓ వైపు బీసీలకు పదవులంటూ మరోవైపు నేనే సీఎం అనడం బీసీ నినాదాన్ని కాంగ్రెస్ పట్టించుకోవడం లేదనే విమర్శను బీసీలు నిజం అనుకునేలా రేవంత్ వ్యాఖ్యలున్నాయి.

అదేవిధంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మీద సీఎం రేవంత్ చేసిన విమర్శలు కాంగ్రెస్‌కు నష్టం చేసేవే.వేం నరేందర్ రెడ్డి ఏం త్యాగం చేసిండు..జీవన్‌రెడ్డి వంటి సీనియర్లు ఏం అన్యాయం చేసిండ్రు? వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ పదవి ఎందుకు ? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లోనే జోరుగా సాగుతోంది. జీవన్‌రెడ్డి మీద విమర్శలు పార్టీకే నష్టం తప్ప ఎలాంటి లాభం ఉండదు.రేవంత్ రెడ్డి చేస్తున్న రాజకీయం పలు విమర్శలకు తావిస్తోంది. ఢిల్లీలో కాంగ్రెస్ వ్యతిరేక కూటమి బీజేపీలోని సభ్య పార్టీ అయిన తెలుగుదేశం నేతలతో అంటకాగడం ఏంటనే ప్రశ్న వస్తోంది. వీలు దొరికితే ఏపీ తెలుగుదేశం నేతలతో కలిసి మంతనాలు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.భవిష్యత్‌లో బీజేపీ వైపు దారులు వేసుకుంటున్నారనే విమర్శలు వచ్చేలా రేవంత్ అడుగులు ఉంటున్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ నేతలకు రుచించడం లేదు.ఇక తమకు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే అనే సంకేతాలు రేవంత్ నోటి నుంచే వస్తుండటం గమనార్హం.వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా బీఆర్ఎస్‌కు దక్కనీయనంటూ రేవంత్ పదేపదే ఛాలెంజ్‌లు చేస్తున్నారంటే బీఆర్ఎస్‌ని చూసి భయపడుతున్నట్లే కదా? ప్రతిపక్ష హోదా కూడా దక్కనీయలేని దీనస్థితిలో బీఆర్ఎస్ పార్టీ ఉందని రేవంత్ శపథాలు చేయడం అవివేకమే అవుతుంది.ప్రతిపక్ష హోదా అందుకోలేనంత దీనస్థితిలో ఉన్న పార్టీ మీద విమర్శలు చేయడం ఎందుకు? ప్రజలకు కేసీఆర్‌ని పదేపదే గుర్తు చేస్తు రాజకీయంగా తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్న రేవంత్‌ది పూర్తిగా రాజకీయ వైఫల్యమేననే అభిప్రాయ వ్యక్తమవుతోంది.అసలు సీఎంగా రేవంత్ రెడ్డికన్నా ఇంకొకరు ఉండి ఉంటే కాంగ్రెస్ పార్టీ మీద ఈ స్థాయిలో ఇంటాబయటా విమర్శలు వచ్చి ఉండేవి కాదని అంటున్నారు.కాంగ్రెస్ సిద్ధాంతం రేవంత్‌కి లేదు.ఆ పార్టీ మీద మమకారం అంతకన్నా లేదు.తన రాజకీయ ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ చక్కగా ఉపయోగపడింది.బీఆర్ఎస్‌కు సరియైన ప్రత్యామ్నాయ వేదిక అయింది.దాన్ని చూసే ఆయన తెలివిగా కాంగ్రెస్‌లోకి వచ్చారు. అయితే ఆ విషయాన్ని అంగీకరించకుండా పదేపదే తన రెక్కల కష్టం మీద కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకొచ్చినా అని చెప్పడం విడ్డూరమే అవుతుంది.ఇలా చెప్పడంలో ఉద్దేశ్యం ఒక్కటే..రేవంత్ లేకుంటే కాంగ్రెస్ లేదని చెప్పడమే.వాస్తవానికి గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడానికి రేవంత్ ఒక కారణం మాత్రమే తప్ప ఆయన వల్లే అధికారం కాంగ్రెస్ దక్కిందని చెప్పడం పూర్తిగా అవాస్తవమే.ఆయన లేకున్నా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉండేది.ఆయన మూలంగా ఏ ఒక్క అభ్యర్థి గెలుపొందలేదు. పార్టీ గుర్తు,పార్టీ చేసిన సేవలు,తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల మనస్సుల్లో ముద్రతోపాటు కేసీఆర్ స్వీయ తప్పిదాల మూలంగా తెలంగాణలో కాంగ్రెస్ జెండా రెపరెపలు చూశాం.సరే..ఇదిలా ఉంటే ఇక సోమవారం జగిత్యాలలో కేసీఆర్ ఒక్కో మాటకు జగిత్యాల జై కొట్టింది.కేసీఆర్ మాటను మరఫిరంగిలా పేల్చిండు. ప్రజల గోసపై, గోడుపై శివాలెత్తిండు. హామీల వంచన, స్కాముల పాలన అంటూ రేవంత్ సర్కార్ మీద మండిపడ్డడు. మంచి మాటకు వినకపోతే.. లాగులు పలిగేదాకా కాంగ్రెస్‌ను ఉరికించాలని పిలుపునిచ్చిండు. పొద్దునలేస్తే సావును కోరుకు నేటోళ్లకు.. వెయ్యి జన్మలెత్తినా తననెవడూ సంపలేడని తేల్చిచెప్పిండు. సహజంగా కేసీఆర్ సభ అంటే జనంలో ఆసక్తి ఉంటుంది.ఆయన మాటలు జనాలకు విసుగెత్తించవు.

ఆయన తిట్లను కూడా ప్రజలు అర్థం చేసుకుంటరు. జగిత్యాల కేసీఆర్ సభలో కూడా అదే జరిగింది.ప్రతీరోజూ చిట్‌చాట్లు, సమావేశాలు, సమీక్షలు చేయరు కేసీఆర్. సభకు సభకు మధ్య చాలా రోజుల విరామం తీసుకుంటారు. జనంలో కనపడటానికి చాలా సమయం తీసుకుంటారు.మౌనం తర్వాత కేసీఆర్ జనంలోకి వస్తాడు.అది ఆయన రాజకీయం. చాలా రోజుల తర్వాత కేసీఆర్ జగిత్యాల సభకు రావడంతో సహజంగానే జనంలో ఆయన మాటలు విందాం అనుకునే ఆసక్తి ఉంటుంది. అనుకున్నట్లే కేసీఆర్ మాటల తూటాలు పేల్చిండు.జనాన్ని తనపైపు చూసేలా చేసిండు. ఎవరి పేరు ప్రస్తావించకుండానే రేవంత్ సర్కార్‌ని చీల్చిచెండాడు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలెక్క అప్పుజెప్తే అంతా ఆగమాగం, అడివడివి చేసిండ్రు. భగీరథ నీళ్లురావు, కరెంటు సక్కగ ఇయ్యరు. రైతుబంధు రాదు, యూరియా ఇయ్యశాతగాదు. మంచిమాటకు వినకపోతే లాగులు పలిగేదాకా ఉరికించాలె.. కాకికి పెడుదామంటే కంకెడు లేవు.. పిట్టకు పెడుదామంటే పిడికెడు లేవు. ఇదీ రాష్ట్రంలో పరిస్థితి. ఎవరిని కదిలించినా ఏడుపే! మూసీని బాగుచేయాల్సిందే. కానీ ఈ సర్కార్ చేస్తున్నది ప్రజల కోసం కాదు.. మూసీ పక్కన రియల్ ఎస్టేట్ దందా.. పేదల ఇండ్లు కూల్చడమే హైడ్రా పని.. అధికారంలోకి రాగానే మొదటి సంతకంతోనే హైడ్రాను ఎత్తి చెరువుల పడేస్తం అంటూ కేసీఆర్ తనదైన శైలిలో విమర్శల తూటాలను సంధించాడు. నాడు సాఫీగా ఇంటింటికీ నీటిని అందించిన మిషన్ భగీరథ ఇప్పుడు ఎందుకు కుంటుపడిందని కేసీఆర్ ప్రశ్నించారు. ‘ఇప్పుడు ఏం రోగం పుట్టిందో నాకు అర్థమైతలేదు. ఇప్పుడు మిషన్ భగీరథ ఎందుకు కుంటుతున్నది? ఎందుకు నీళ్లు వస్తలేవు? వస్తున్నాయా ఇప్పుడు నీళ్లు? (జనాల నుంచి స్పందన ‘రావట్లేదు’) మరి ఏం చేయాలె? లాగులు పలిగేదాకా చంపాలె. మంచి మాటకు వినకపోతే ఏం చేస్తరు? మంచిగా కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి కదా? ఐదేండ్లు నడిచింది కదా? మరి మీకేం బీమారి వచ్చిందో నాకు అర్థమైతలేదు. ఇకడ దరిద్రం పోయేదాకా పోరాడాలె. ఇకడ క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజలు ఇది మా తెలంగాణ, మేము గర్వంగా బతుకుతం, సంతోషంగా బతుకుతం అని తలెత్తుకొని వచ్చేదాకా మనం సేవ చేయాల్సిందే. చివరి శ్వాస దాకా చేయాల్సిందే. అందరం యువకుల్లాగా ముందుకు దూసుకొని పోదాం. తెలంగాణ ఎట్ల బాగుపడదో చూద్దాం’ అంటూ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల పాటు అందిన కరెంట్ ఇప్పటి కాంగ్రెస్ సర్కార్‌లో ఎందుకు రావడం లేదని కేసీఆర్ నిలదీశారు. ‘కరెంట్ కేసీఆర్ ఉన్న రోజులు మంచిగుండెనా? (‘అవును’ అని జనాల నుంచి స్పందన) మరి మళ్లా ఇప్పుడు ఏం రోగం వచ్చె? ఏం బీమారి వచ్చె? కరెంట్‌ను కాకి ఎత్తుకపోయిందా? ఆనాడు 7,000 మెగావాట్లు ఉంటే.. ఏడాది లోపట మంచిగ చేసి, 24 గంటల కరెంటిచ్చి నం. ఒక క్షణం కూడా పోకుండ ఇచ్చినం. ఎప్పుడైనా రిపేర్, టెక్నికల్ ప్రాబ్లం వస్తది తప్ప పోకపోతుండె. అంత మంచి పవర్ సప్లయ్ చేసినం. యాదాద్రి, భద్రాద్రి, చాలా కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం చేసినం. జనరేటింగ్ స్టేషన్లు పెట్టినం. 20 వేల మెగావాట్లకు తీసుకెళ్లిపోయినం. మరి ఏం రోగం వచ్చింది? ఎందుకు ఇబ్బంది పెడుతున్నరు? అనేక చోట్ల రైతుల పొలాలు ఎండుతున్నయి కదా? పేపర్లలో ఫొటోలు వస్తున్నయి, టీవీల్లో వార్తలు వస్తున్నయి.. జనం ఏడుస్తున్నరు. ఎందుకు ఈ బాధ కలుగుతున్నది? ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది జీవన్మరణ సమస్య.. మన బతుకుదెరువు సమస్య’ అని కాంగ్రెస్ సర్కార్‌ను దునుమాడారు.గంగాళంలా ఉన్న చెరువులు ఉమ్మడి పాలనలో తాంబాలంలా ఎలా మారాయో.. వాటిని బీఆర్ఎస్ పాలనలో ఎలా అభివృద్ధి చేశారో కేసీఆర్ వెల్లడించారు. ‘సమైక్య రాష్ట్రంలో మొత్తం తెలంగాణ చెరువులను నాశనం చేసిండ్రు. కాకతీయ రాజులు తవ్వించిన చెరువులు ఉండె మనకు. బ్రహ్మాండంగా 80 వేల చెరువులు ఉండె. ఆంధ్రా పాలకుల సమైక్య పాలనలో మొత్తం నాశనం పట్టిచ్చిండ్రు. కబ్జాలు పెట్టిండ్రు. నాశనం పట్టిచ్చిండ్రు. చివరికి 44 వేల చెరువులు మిగిలినయ్. ఎకడ మొదలు పెట్టాలె? ఎవరి పేరు పెడితే బర్కత్ అయితది? అని ఆలోచించి.. ఏ కాకతీయ రాజులైతే మనకు అన్నం పెట్టిండ్రో, వాళ్ల పేరుతోనే ఇది బాగు చేయాలని చెప్పి మన మొట్టమొదటి కార్యక్రమం మిషన్ కాకతీయ చేపట్టినం. ఆ చెరువుల దరిద్రం వదిలిస్తే, వాటిని బందోబస్తు చేస్తే, వాటిలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగితే, గ్రౌండ్ వాటర్ పెరుగుతది. బోర్లకు బాగా నీళ్లు పోస్తయి. తెలంగాణ ప్రజలు, రైతులు దాన్ని ఒక ఉద్యమం లాగానే చేసిండ్రు. మట్టి తీసుకుపోండ్రి సారవంతంగా ఉంటది, మీ పొలాల్లో పోసుకోండ్రి అంటే తెలంగాణ రైతాంగం లక్షల ట్రాక్టర్ల మట్టి తీసుకుపోయిండ్రు. అకడ నుంచి మొదలుపెట్టిన ప్రస్థానం.. పదేండ్లలో ఏం చేసినమో మీరు చూసిండ్రు’ ..పొద్దున లేస్తే కేసీఆర్ సావాలని మాట్లాడుతున్నరు. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడతయా? నువ్వు వెయ్యి జన్మలెత్తినా.. నా కొడకా.. నేను సచ్చేదిలేదు! చివరి శ్వాస వరకు తెలంగాణకు సేవ చేస్త అంటూ కేసీఆర్ చేసిన ప్రసంగం బీఆర్ఎస్ కార్యకర్తలు,నేతల్లో ఉత్సాహాన్ని నింపింది.మళ్ళీ అధికారం బీఆర్ఎస్‌దేననే నమ్మకాన్ని ఆ పార్టీ కార్యకర్తలు, నేతలకు ఇచ్చేలా చేసిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీకి బలం.కేసీఆర్‌ని పదేపదే విమర్శిస్తూ రెచ్చగొడితే కాంగ్రెస్ పార్టీకే నష్టం. ఇప్పుడు రేవంత్ రెడ్డి చేస్తున్నది అదే.పదేపదే కేసీఆర్ మీద అనుచిత విమర్శలు, చావు భాష వాడటం కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నాశనం చేసేవే. అయితే కాంగ్రెస్ నాశనం అయితే రేవంత్‌కి ఏంటి? పార్టీ రేపు అధికారంలోకి రాకున్నా ఆయనకు కల్గే నష్టమేమీ ఉండకపోవచ్చు.సీఎం కావాలనే ఆశ నెరవేరింది.కాంగ్రెస్ సిద్ధాంతాలతోనే రాజకీయాలు చేసిన వ్యక్తి రేవంత్ కాదు.పార్టీ ఫిరాయింపులు ఆయనకు కొత్తేమీ కాదు.దాదాపు అన్ని పార్టీలు మారిన రేవంత్ రేపటిరోజున కమలం చెంతకు చేరడనే గ్యారెంటీ లేదు.ఆయనకు కావాల్సింది తనని జైలుపాలుచేసిన కేసీఆర్‌ని జైలుకు పంపించాలి. తనని ఇబ్బందిపెట్టిన పార్టీని అధికారంలోకి రాకుండా చేయాలి? ఈ క్రమంలో పార్టీ నష్టపోయినా,తను నష్టపోయినా పర్వాలేదని ఆయనే స్వయంగా గతంలో అన్నారు.అంటే బీఆర్ఎస్‌ని అధికారంలోకి రాకుండా చేయడానికి ఏ ద్వారమైనా తెరుస్తా అనే వాదంలోనే రేవంత్ ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి.అయితే తన నియోజక వర్గంలో తనే గెలుస్తానో? ఓడుతానో చెప్పడం హేమాహేమీ రాజకీయ నేతలకే సాధ్యం కాదు.అలాంటిది ఓ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కనీయ..అలా చేయకపోతే నా పేరు మార్చుకుంటా? అని పదేపదే శపథాలు చేయడం ఉత్తుత్తివే.అంత శక్తి రేవంత్‌కి ఉందని స్వంత పార్టీ నేతలే అంగీకరించరు. ఏది ఏమైనప్పటికీ ఒకేరోజు జరిగిన రేవంత్,కేసీఆర్ సభలతో తెలంగాణ రాజకీయాల్లో మాటల ఘాటు తారాస్థాయికి చేరింది.అప్పుడే ఎన్నికలు వచ్చాయా? అని అంతా అనుకునేలా ఇరువురి నేతల ప్రసంగాలు ఉండటం విశేషం.

......................................

మానసాని కృష్ణారెడ్డి
9618616110

# అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లను పంపిణీ చేసిన మంత్రి వివేక్

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్న సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకొని విధులు నిర్వహించాలని కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. అనంతరం మండలంలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. 37 మంది లబ్ధి దారులకు కళ్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా పాలన కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని,ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి లబ్ధి దారులకు ఇస్తున్నామన్నారు.గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ప్రజల సొమ్మును వృధా చేసిందని మండిపడ్డారు.బాల్క సుమన్ నేను తెచ్చిన నిధులే ఇప్పుడు ఖర్చు చేస్తున్నారు అని అంటున్నాడు మరి నిధులు ఉంటే అప్పుడు అభివృద్ధి ఎందుకు చేయలేదో ప్రజలకు చెప్పాలన్నారు. నువ్వు ఏమి అభివృద్ధి చేయలేదనే నిన్ను ఒడగొట్టారు ప్రజలు కేవలం సోషల్ మీడియాను అడ్డు పెట్టుకొని ప్రభుత్వం మీద అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నాడు బాల్క సుమన్ అని మండిపడ్డారు.నేను గెలిచాక ఇక్కడ అనేక అభివృద్ధి పనులు చేపట్టాను చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా..ఇక్కడ యువతకు ఉపాధి కల్పించడానికి జర్మనీ సంస్థ టామ్ కామ్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని మంత్రి అన్నారు. యువకులు జర్మనీలో ఉపాధి పొందాలంటే మా కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు.

# నూతన ఎంపీడీవోను కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు

**వాస్తవం : లక్ష్మణ చందా**



లక్ష్మణ చందా మండల ప్రజా పరిషత్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రమాకాంత్‌ను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువాతో సన్మానించి, ఎంపీడీవోను అభినందించారు.ఎంపీడీవోని మండల అభివృద్ధికి సహకరించాలని, వివిధ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి, తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు కొండ్రా నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కిరణ్ ఠాకూర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ లింగారెడ్డి, పాల్గొన్నారు

# విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు


## తహసిల్దార్ జ్యోతి

**వాస్తవం : మోత్కూర్**



విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తహసిల్దార్ జ్యోతి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కస్తుర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. విద్యార్థి దశ నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజం లోని అన్ని అంశాలపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ ఓ యాదమ్మ, రేఖ, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా నేతన్న భరోసా చెక్కుల పంపిణీ



**వాస్తవం: అందోల్:** నేతన్న భరోసా పథకంలో భాగంగా మంగళవారం నాడు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ పాండు , సహాయ సంచాలకులు హబీబ్ వెంకట రావు చేనేత జౌలి శాఖ ,జోగిపేట హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వర్కల అశోక్ చేతుల మీదుగా జిల్లాలోని 31 మంది చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ చేశారు. ఇందులో భాగంగానే తొలి త్రైమాసికంకు సంబంధించిన రూపాయలు 97, 500/- చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అభివృద్ధి అధికారి లలిత చేనేత , జౌలి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ప్రశాంత్ చేనేత , జౌలిశాఖ, కార్యాలయ సిబ్బంది షరీఫ్ జోగిపేట , నారాయణఖేడ్ చేనేత సంఘాలకు సంబందించిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను

# రైతులు వినియోగించుకోవాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.కేంద్రంలో ధాన్యం కుప్పలు, తేమ శాతం వంటి అంశాలను పరిశీలించిన ఆయన, కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగాలని అధికారులకు ఆదేశించారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఎత్తుకుపోయేలా చూసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాత. సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గోమాటి నరసయ్య వంగ గిరిధర్ రెడ్డి బొప్పాపూర్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**వాస్తవం: వేములవాడ**

వేములవాడ రూరల్, పట్టణ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంతో పాటు వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లి, చెక్కపల్లి, ఆచ్చన్నపేట, వెంకటంపల్లి, నూకలమర్రి, మర్రిపల్లి, హనుమాజీపేట, బొల్లారం, మల్లారం గ్రామాలలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ....రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహిస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్, అర్బన్ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు, ఖమ్మం గణేష్ శంకర్, సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, సంగె స్వామి, కరుణాకర్ వార్డు సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అశేష పాఠకాదరణ పొందిన వాస్తవం డిజిటల్ పత్రిక ఆర్ఎన్ఐ అనుమతులున్న జనోదయ ప్రింట్ పత్రికలకు
రాజకీయ, ఆర్థిక,సామాజిక,సాహిత్య వ్యాసాలతోపాటు ఇతర వార్తల కవరేజీ సమాచారాన్ని పంపడానికి
ఆహ్వానం
8074124190
9618616110


మానసాని కృష్ణా రెడ్డి
వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు
Manasani Krishna Reddy

# బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి



**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

జనగణన – 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆఖరి రోజు శిక్షణ కొనసాగుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండా కాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూ మరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, ఛార్జ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మహేష్ కుమార్, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రత్నాపూర్‌లో పారిశుద్ధ్యానికి పెద్దపీట

**సర్పంచ్ పల్లె ప్రతిమ**



**వాస్తవం : రామగిరి**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అన్నారు. రత్నాపూర్ గ్రామంలో సంజవ నగర్ ప్రాంతంలో మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా జరుగుతున్న పనులను ఆమె ప్రారంభించారు. మట్టి కాల్వలలో పేర్కొని పోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయగా,జెసిబి సహాయంతో చెత్తాచెదారం తొలగించారు. రత్నాపూర్ నుండి సంజీవనగర్ పోయే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల పెరిగిన తుమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు ఖండే లక్ష్మీ గట్టయ్య,ఖండే సాహితి పోషం,సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వచర్ల ప్రభుత్వ ఉపాధ్యాయుడికి

# మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ అవార్డు

**వాస్తవం:రామగిరి**



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల జడ్.పి.హెచ్.ఎస్ లో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పనిచేస్తున్న మల్లారపు శంకర్ ప్రతిష్టాత్మక మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ అవార్డు – 2026 అందుకున్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 19న జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 9వ తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా శంకర్‌ను శాలువా,పుష్పగుచ్ఛం,జ్ఞాపిక, సన్మాన పత్రంతో ఘనంగా సత్కరించారు. మల్లారం శంకర్ జడ్.పి.హెచ్.ఎస్ కల్వచర్లలో హిందీ ఉపాధ్యాయుడిగా, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్‌గా సేవలు అందిస్తున్నారు.ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కృషి,సామాజిక సేవలందించిన సన్మాన గ్రహీత జాబితాలో మార్చి 15న తిరుపతిలో జరిగిన 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌కు ఎంపికైనప్పటికీ ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల హాజరు కాలేకపోయారు. దీంతో నిర్వాహకులు ప్రత్యేకంగా హైదరాబాద్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానించి అవార్డు అందజేశారని బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు శంకర్‌కు అభినందనలు తెలిపారు.

## ప్రణాళిక ప్రకారం పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వాస్తవం: సిరిసిల్ల**

పోటీ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు యువత, అభ్యర్థులు సిద్ధమవుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారితో మాట్లాడారు. విద్యార్థులు, ఏ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నారు? ఏ ఏ పుస్తకాలు చదువుతున్నారు? ఆరా తీశారు. రోజు ఎంత మంది లైబ్రరీకి వస్తారని గ్రంథాలయ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... అన్ని సబ్జెక్టులు ప్రణాళిక ప్రకారం.. ప్రతి అంశం క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కరెంట్ అఫైర్స్, ఇతర అన్ని అంశాలపై మంచి అవగాహనతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలు కూడా రిఫరెన్స్‌గా తీసుకోవాలని సూచించారు.

# అంగన్వాడీలో చేర్పించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయండి

**కౌన్సిలర్ రేఖా ప్రవీణ్**

**వాస్తవం : అందోల్**



పిల్లలకు పోషణ విద్య ఆరోగ్యం అందించే అంగన్వాడీ కేంద్రం అమ్మ వంటిదని అలాంటి దాన్ని చులకన చేయకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని అంగన్వాడి కేంద్రంలో చేర్పించి పిల్లల్ని బాగుపరచాలని ఆందోల్ జోగిపేట మున్సిపల్ పదవ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్లరేఖ ప్రవీణ్ అన్నారు. పదవ వార్డులోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంతో విద్యా బుద్ధులు నేర్పుతూ, పాఠశాలలకు అలవాటు అయ్యే విధంగా ఇక్కడి టీచర్లు నేర్పుతున్నారని ఆమె వివరించారు ,ఇలాంటి స్కూల్ కి మన వార్డులోనే ఉన్నందున తప్పకుండా పంపించాలని పేర్కొన్నారు. సూపర్వైజర్ మేడం మాట్లాడుతూ విద్యార్థుల బ్రెయిన్ డెవలప్మెంట్ గురించి పేరెంట్లకు ఆట పాటలతో వివరించి తెలిపారు. అంగన్వాడీ టీచర్ సుమిత్ర మాట్లాడుతూ నిపున్భారత్ అంగన్వాడీలో మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు విద్య బుక్స్ సిలబస్ ఉంటుందని తెలిపారు. ఇందులో సంవత్సరం కార్యక్రమాల ప్రణాళిక, మాసం కార్యక్రమ ప్రణాళిక, వారం కార్యక్రమాల ప్రణాళిక, ఒక్కరోజు కార్యక్రమాల ప్రణాళికల గురించి వారికి సమవరంగా వివరించారు. గత నాలుగు సంవత్సరా లుగా వార్షికోత్సవం జరుపుకుంటున్నా మన్నారు, ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేఖ, అంగన్వాడీ టీచర్లు విజయ, సుమిత్ర, గౌరీ, ఆయా సల్మా, తల్లిదండ్రుల పిల్లలు యూత్ సభ్యులు, సూపర్వైజర్ అమృతవాణి, ప్రమీల, గుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**వాస్తవం : లక్ష్మణ చందా**



లక్ష్మణచందా మండల కేంద్రంలో రూ.14 లక్షలతో ఊర చెరువు మరమ్మతులకు, రూ. 8లక్షలతో పులి చెరువు మర మ్మతులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. చెరువుల మరమ్మత్తుల నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి గ్రామ కమి టీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామంలో మార్కండేయ స్వామి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా మహేశ్వర్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు అద్వాల రమేష్, గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

**పన్నూర్‌లో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ చిందం మహేష్**

**వాస్తవం : రామగిరి**

మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం. పన్నూరులో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ చిందం మహేశ్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సిఫారసుతో వైట్రీస్ ఫేమీ లైఫ్ సైన్సెస్,అలీప్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.' గ్రామాల్లోని మహిళలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా,వృత్తి



శిక్షణ పొంది స్వయం ఉపాధి సాధించాలి.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో మన గ్రామానికి ఈ అవకాశం రావడం సంతోషకరం.శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి,కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం,ట్రైనర్ ఆకుల స్రవంతి,ఐకెపి,ఎపిఎం పద్మ, సీసీఎల్. బత్తుల శంకర్ వి.ఓ.ఏ గాజుల వనిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ఎల్లమ్మ సిద్ధోగం



**వాస్తవం: కోనరావుపేట**

గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధోగం ఘనంగా నిర్వహించారు. శ్రీ ఎల్లమ్మ అమ్మవారి (జమదగ్ని) కళ్యాణ మహోత్సవాన్ని బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో మంగళవారం కోనరావుపేట మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు.వికాస్ రావు వెంట బిజెపి కోనరావుపేట మండల అధ్యక్షులు ధర్మారం సర్పంచ్ మిర్యాల్కర్ బాలాజీ, జిల్లా జనరల్ సెక్రటరి సిరికొండ శ్రీనివాస్, బీజేపీ కార్యకర్తలు, గౌడ కులస్తులు, భక్తులు ఉన్నారు.

# బయ్యారం అంగన్‌వాడీలో 'పోషణ పక్వాడ్'

**వాస్తవం : కాటారం**

కాటారం మండలం పరిధిలోని బయ్యారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 'పోషణ పక్వాడ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇనుగాల లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలంటే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు విధిగా పోషకాహారం తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమతుల్య ఆహారం ద్వారానే శారీరక దృఢత్వం, మానసిక వికాసం సాధ్యమవుతుందని, తద్వారా పోషకాహార లోపం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలను ఆదిలోనే నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో మహిళలందరికీ ఆరో



గ్యంపై అవగాహన పెంపొందించడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్వైజర్ శివరాణి మాట్లాడుతూ.. గర్భిణీలు, కిశోర బాలికలు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఐలి లక్ష్మి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ హైమావతి, ఆయా ఎస్.కె. సర్దార్ భీ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆది శ్రీనివాస్



**వాస్తవం: కోనరావుపేట**

కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు.రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఆది శ్రీనివాస్ సూచించారు.రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, డైరెక్టర్‌లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# గురుకులంలో సమ్మర్ హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

**వాస్తవం : కాటారం**

కాటారం మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం కళాశాలలో ప్రజా పాలనలో భాగంగా హ్యాండ్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 29 వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరాన్ని కాటారం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర కళాశాల ప్రిన్సిపల్ సోమోజీ ప్రారంభించారు. గర్ల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎ. మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. వెంకటయ్య కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ



ప్రతిభ కనబరచాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వాన్ని కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడతాయని తెలిపారు. క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల పీడీ కల్పన, కుడిమేత మహేందర్, పీటీ మంతెన శ్రీనివాస్, కోచ్ మూల వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థులకు ప్రాథమిక నైపుణ్యాల నుంచి ఆధునిక శిక్షణ వరకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాంప్ ద్వారా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

# ఎన్గల్‌లో ముందస్తు బడిబాట




**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో తిరుగుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేరేటట్టు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల సౌకర్యాలు వివరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశ్నిపర్తి శోభారాణి– సుధాకర్, ఉప సర్పంచ్ మ్యాకల జలందర్,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శీలం సునీతారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగ తిరుపతి,మాజీ విద్యా కమిటీ చైర్మన్ కుసుంబ జనార్దన్, వార్డు సభ్యులు లాండే తిరుపతి, ఉపాధ్యాయులు ప్యారం లక్ష్మీనారాయణ, ఎడ్ల కృష్ణచైతన్య, శ్రీలత, చైతన్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 15 సంవత్సరాల బాలికను

# ప్రేమిస్తున్నా అని చెప్పి అత్యాచారం చేసిన యువకుడు

వాస్తవం : చెన్నూర్ ఆర్సి

వెంటబడి నమ్మించి ఆమెపై అత్యాచారానికిపాల్పడటమే గాక మైనర్ బాలికను వివాహం చేసుకొని ఆమెను మా నసికంగా శారీరకంగా వేధించి ఇంటినుండి గెంటవేసిన కిష్టంపేటకు చెందిన స్వామి అనే యువకుడి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండు కు తరలించిన చెన్నూర్ పట్టణ సీఐ. గత సంవంత్సరం అక్టోబర్ నెలలో కిష్టంపేట కు చెందిన స్వామి అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 15 సంవత్సరాల మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి పెళ్లిచేసు కుంటానని నమ్మించి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి ఆ తరువాత ఆ మైనర్ అమ్మాయిని ఆమె కుటుంబీకుల నిర్ణయానికి వ్యతిరేకంగా వివాహం చేసుకొని ఇంటికి తీసుకొనివెళ్లి ఆమెను కొద్ది కాలానికే మానసికంగా శారీరకంగా వే ధింపులకు గురిచేసి ఇంటి నుండి గెంటివేయడమే గాక గత 6 నెలలుగా ఆమెను స్వామి మరల లైంగిక వేధిం పులకు గురిచేయడంతో మైనర్ బాలిక తన తల్లితం



డ్రుల సహాయంతో చెన్నూర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో నిన్న పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన మరియు వివాహం చేసుకుని వేధింపులకు గురిచేసిన స్వామి అనే యువకుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన చెన్నూర్ పట్టణ సీఐ. మైనర్ బాలికలను ఎవరైనా ప్రేమ పెళ్లి పేరిట వెంటబడిన వారిని లైంగి కంగా వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే గాక రౌడీ షీట్ కూడా తెరుస్తామని చె న్నూర్ పట్టణ సీఐ హెచ్చరించారు.

# మిషన్ భగీరథ నీటీ సరఫరాలో ఇబ్బందులు రావద్దు

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, రుద్రవరం ఇన్ టెక్ వెల్ పరిశీలన**

వాస్తవం: వేములవాడ

వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలోని అన్ని మున్సిపాలి టీలు, గ్రామాల పరిధిలో మిషన్ భగీరథ నీరు సరఫరా లో ఇబ్బందులు రాకుండా ప్రణాళిక ప్రకారం ముందు కు వెళ్లాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్ర వాల్ ఆదేశించారు.వేములవాడ మండలం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, నీటి శుద్ధి, సరఫరా, రుద్రవరం లోని ఇన్ టెక్ వెల్ ను క్షేత్రస్థాయిలో మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ప్రక్రియను క్షుణ్ణంగా కలెక్టర్ కు మిషన్ భగీరథ ఇంజనీర్లు వివరిం చారు. పంపింగ్ సామర్థ్యం, స్టోరేజి వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ప్రస్తుత వేసవి



ఉన్నందున ప్రతి ఇంటికి నల్ల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.రోజు నీటి శుద్ధి కేంద్రాల నుంచి నీ రు సరఫరా జరిగేలా మిషన్ భగీరథ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంత్రాల మరమ్మత్తు ఉంటే త్వరితగతిన చేయించి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. నీటి పారుదల, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ప్రాజెక్టులలో నీటి మట్టాన్ని పరిశీలిస్తూ.. ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశిం చారు.ఈ పరిశీలనలో మిషన్ భగిరథ ఇంట్రా, గ్రిడ్ కార్య నిర్వాహక ఇంజనీర్లు అన్వర్, సుమలత, డీఈ రాము, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామికి మహారాష్ట్ర

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రత్యేక పూజలు



వాస్తవం : వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అను బంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గౌరవ చైర్మన్ వివేక్ లక్ష్మీకాంత్ భీమన్వార్ స్వామివారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయా నికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజల అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా, స్వామివారి శేష వస్త్రం, ల డ్డు,తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ వాతావరణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది.

## ప్రజా పాలన పగతి పాలన



వాస్తవం : మోత్కూర్

99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ వారం నిర్వహిస్తున్న సం క్షేమ వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్సీ బాలు ర వసతి గృహంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సి పల్ చైర్మన్ శ్రీమతి గడ్డం స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నా ణ్యమైన భోజనం, వసతి వంటి సదుపాయాలను కల్పిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచిం చారు. వైస్ చైర్మన్ శ్రీ పల్లెర్ల వెంకన్న విద్యార్థులను అభినందిం చారు.మండల ప్రత్యేక అధికారి మరియు హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీ జి. సురేష్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి, ఫిజికల్ గేమ్స్ ఆడడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. వైస్ చై ర్మన్ పల్లెర్ల వెంకన్న మాట్లాడుతూ హాస్టల్ అభివృద్ధికి మున్సిపాలి టీ నుండి పూర్తి సహకారం ఇస్తామని తెలియచేసినారు.పోటీలలో గెలుపొందిన కే. బన్నీ, ఎం. అవిలాష్, జి. ఆదిత్యలకు బహుమ తులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. సతీష్ కుమార్,హాస్టల్ వార్డెన్ శ్రీ అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# బోయినపల్లి పోలీస్ స్టేషన్ నిఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**గ్రామాల్లో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి**

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి పోలీస్ స్టేషన్ ని మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు,రికార్డు లను సమగ్రంగా పరిశీలించి, కేసుల దర్యాప్తులో ఎటు వంటి అలసత్వం ప్రదర్శించకుండా,పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి,చట్టపరంగా నింది తులకు శిక్ష పడేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆదే శించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను కఠినతరం చేయాలని, శాంతి భద్రతలకు భంగం కలి గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ సమగ్ర భద్ర తను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అ ధికారులను ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగం గా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పిం చాలని పేర్కొన్నారు. తెలియని కాల్స్, మెసేజ్‌లు, లింకు లు, ఓపిటి లను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయా లని,వాహనదారులకు హెల్మెట్,సిటిబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అన ర్థాలు,మైనర్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రజలకు నేరాల నియంత్రణలో సీసీ కెమె రాల ప్రాముఖ్యతను వివరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటు లో ప్రజలను, వ్యాపారస్తులను, ప్రజాప్రతినిధులను భాగ స్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయా లని అన్నారు.స్టేషన్ పరిధిలో గంజాయి,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా ఎస్పీ మహేష్ బి గితే వెంట వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు,సిఐ శ్రీని వాస్, ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.





### వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన

# మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్

**వాస్తవం : మంథని**

మంథని మున్సిపాలిటీలోని శ్రీరామ్ నగర్,గంగాపురి, శ్రీపాద కాలనీ,అంగులూరు శివారు ప్రాంతాలలో వరి కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ...రైతులు తమ పంటను మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వానికి విక్రయించుకునేలా ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ



కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి,పాలక వర్గ సభ్యులు మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి,పెంటరి రాజు,ఎల్లెంకి వంశీ ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంతోనే మేలు


**కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదు**

**రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

**వాస్తవం : చందుర్తి**

పేద ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంతోనే మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారుచందుర్తి మండల కేంద్రంలో మంగళవారం ఆది శ్రీనివాస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం రైతు వేదికలో అర్హులైన 90 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను శ్రీనివాస్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళ లాగా పని చేస్తుందని తెలిపారు.పేద ప్రజలకు కేవలం ఇందిరమ్మ రాజ్యంలో మాత్రమే సంక్షేమ పథకాలు అందుతాయి అన్నారు.గతంలో ఇందిరాగాంధీ దేశంలో అనేక పేద ప్రజలకు ఉపయోగ పడే పనులను ప్రారంభించారని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఏర్పడిన వెంటనే ఆడవారికి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 10 వేల కోట్ల విలువ గల 3 వేల కోట్ల ఆర్టీసీ ఉచిత ప్రయాణాలు జరిగాయని పేర్కొన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్ సన్నం బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు..ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభం చేసిన ఉచిత విద్యుత్ నేటికి కొనసాగుతుంది అన్నారు. కొందరు అక్కడ అక్కడ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పోవాలని పిల్లి



శాపనార్థాలు పెడుతున్నారని, కానీ ప్రజల ఆశీర్వాదం లభించి మరో మారు ప్రజా ప్రభుత్వంలో ఏర్పడుతుందని అన్నారు..పేద ప్రజలకు రాజకీయాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదన్నారు.రానున్న రోజుల్లో ప్రజా ప్రభుత్వనికి ఆశీర్వాదలు అందజేయాలని సూచించారు.రాజన్న ఆలయాన్ని 150 కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విస్తరణ అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని పేర్కొన్నారు.త్వరలోనే ఆశిరెడ్డి పల్లి కొచ్చేరువు కు నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు,రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి,వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం,డైరెక్టర్లు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం

**రెండో సమావేశంలో కీలక నిర్ణయాలు**

**వాస్తవం : సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సభ్యులతో అక్రిడేషన్‌కు సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు.అక్రిడేషన్ ప్రక్రియను మరింత విస్తృతంగా పరిశీలించి, తదుపరి సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ప్రెసిడెంట్ అక్రిడేషన్ కమిటీ ప్రతిని సభ్యులకు అందజేశారు.హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టుల సమస్యలను కూడా ఈ సమావేశంలో ప్రస్తావించారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు



తీసుకోవాలని అక్రిడేషన్ కమిటీ సభ్యుడు, టీజేఏ జిల్లా నాయకుడు వంగరాజు కలెక్టర్‌ను కోరారు. తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) తరపున సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యునిగా నియమించినందుకు టీజేఏ వ్యవస్థాపకుడు ఉప్పల లక్ష్మణ్‌కు అలాగే యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.తదుపరి సమావేశంలో అక్రిడేషన్ అంశంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# విద్యాసంస్థల్లో విద్యార్థులకు పోటీలు

**ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా పలు విద్యాలయాల్లో విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు.జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు, గురుకుల విద్యాలయాలు, ఇతర రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి.. అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లో ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెండు బైకులు ఢీకొన్న ప్రమాదం

**ముగ్గురికి గాయాలు**



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.కామారెడ్డి జిల్లా రెడ్డిపేట తండాకు చెందిన గంగాపతి సురేష్ తన సోదరుడి కుమార్తె లావణ్యను హాస్టల్‌లో దింపేందుకు బైక్‌పై వెళ్తుండగా, హరిదాస్ నగర్‌కు చెందిన ప్రవీణ్ నడుపుతున్న మరో బైక్ ఢీకొట్టింది.ఈ ఘటనలో సురేష్,లావణ్యతో పాటు ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

# విద్యార్థుల్లో సృజనాత్మక వెలికితీతకే పోటీలు

**పకడ్బందీగా సంక్షేమ వారోత్సవాలు అమలు**

**జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**



**వాస్తవం : తంగళ్లపల్లి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాల కింద బద్దెనపల్లి టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులకు వివిధ పోటీలు.ఆకట్టుకున్న చిత్రలేఖనం, డిబేట్ ఇతర పోటీలు.విజేతలకు బహుమతుల అందజేత.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం,జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, గురుకులాల డీసీఓ థెరిస్సా, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ సిలివేరి లావణ్య చిరంజీవి , ప్రిన్సిపాల్ బీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవం



# బ్రిడ్జి అయ్యేది లేదు దారి బాధ తీరేది లేదు

**కొన సా...గుతున్న అండర్ బ్రిడ్జి పనులు**
**త్వరగా పూర్తి చేయాలి**
**పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీ కృష్ణకు**
**వినతి పత్రం అందజేత**

**వాస్తవం : మందమర్రి**


మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోవికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు,బీసీ ,ఎస్సీ ,ఎస్టీ ,జేఏసీ రాష్ట్ర నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు ఎంపీగడ్డం వంశీకృష్ణ ను మంగళవారం తన నివాసంలో కలిసి ,మందమరి రైల్వే స్టేషన్ లోని ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.మందమరి రైల్వే గేట్ సమీపంలో అండర్ బ్రిడ్జి గత ఐదు సంవత్సరాల నుంచి కొనసాగుతూనే..ఉంది. ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు బ్రిడ్జి పనులు పూర్తికాలేదు, రైల్వే మెయిన్ లైను, మూడవ లైను వేస్తున్నందున రైల్వే గేటు మూసి వేయబడి నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్, మందమర్రి గ్రామాల ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా.. మందమర్రి రైల్వే స్టేషన్లో ఉన్నటువంటి ప్రధాన సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిలో ప్రధాన సమస్యలు.

1.అండర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి అయ్యేవిధంగా రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడి, ప్రజలకు అండర్ బ్రిడ్జి రవాణా సౌకర్యం కల్పించగలరని మనవి చేశారు.

2.మందమరి రైల్వే స్టేషన్‌లో రామగిరి ప్యాసింజర్ కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్ టతెలంగాణఊ సింగరేణి ,ప్యాసింజర్ రైళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం నిలుపుదలకు కృషి చేయాలన్నారు.

3.మందమరి రైల్వేస్టేషన్లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి మూడో లైన్ వరకే పరిమితం చేశారు దానిని పూర్తిగా నాలుగో లైన్ పై నుండి మందమరి పోయే ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తిగా నిర్మించాలన్నారు.

4. నూతనంగా నిర్మిస్తున్న మందమర్రి రైల్వేస్టేషన్లో వికలాంగుల ,వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్ సౌకర్యం



కల్పించే విధంగా చూడాలన్నారు

5.మందమర్రి రైల్వే స్టేషన్ లో టికెట్ బుకింగ్ కౌంటర్ ఇరువైపులా ఏర్పాటు చేయాలన్నారు.పై విషయాలు సామాజిక దృక్పథంతో ఆలోచించి ప్రజల సౌకర్యార్థం పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

**ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత**

**వాస్తవం : ఎల్కతుర్తి**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉనికి ప్రమాదంలో పడిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎంపీడీవో విజయ్ కుమార్‌ను కలిసి, ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గుమ్మడి రాజుల రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ప్రధాన డిమాండ్లు,?బిల్లు రద్దు: కేంద్రం తీసుకురావాలని యోచిస్తున్న 'విభజీ రామ్ బిల్లు' వల్ల కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందని,దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వేతనాలు,పని దినాలు: ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, ఎటువంటి కొలతలు లేకుండా రోజువారీ వేతనం రూ. 600 చెల్లించాలని కోరారు.సౌకర్యాల లేమి: పని ప్రదేశాల్లో మంచినీరు, నీడ, మెడికల్ కిట్ల వంటి కనీస వసతులు లేక కూలీలు అల్లాడుతున్నారని మండిపడ్డారు.యాప్ నిబంధనలు: పని ప్రదేశాల్లో రోజుకు



రెండుసార్లు ఫోటోలు తీసే విధానం వల్ల కూలీలు వేతనాలు కోల్పోతున్నారని, ఈ నిబంధనను తొలగించి ఒక్కసారి ఫోటో తీస్తే సరిపోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ హామీ:ఉపాధి కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. "2005లో ఎంతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బడ్జెట్ కోతలతో, కొత్త నిబంధనలతో నిర్వీర్యం చేసే కుట్రను సహించబోం అని గుమ్మడి రాజుల రాములు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కమిటీ మెంబర్ అంబాల స్వరూప, కమిటీ సభ్యులు లోకిని స్వరూప, సుబ్రహ్మణ్యం, రాధ, కరుణ, షణ్ముఖం, యాదగిరి, సర్కార్, అజ్మీర, బిక్షపతి, మెట్టు సమ్మయ్య, రజిత మరియు పెద్ద సంఖ్యలో మహిళా కూలీలు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయ జూనియర్ అసిస్టెంట్‌కి ఘన వీడ్కోలు

**వాస్తవం : వేములవాడ**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి దత్తత దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో 17 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సేవలందించిన జూనియర్ అసిస్టెంట్ జన్మంచి లక్ష్మీరాజం బదిలీపై జగిత్యాల జిల్లా పెంబట్లలోని శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లారు.ఈ సందర్భంగా ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి రమాదేవి లక్ష్మీరాజం కు బదిలీ ఉత్తర్వులను మంగళవారం అందజేసి, స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందించారు. తదానంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఉద్యోగుల యూనియన్ తరపున అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి వంశీ మోహన్‌ల సమక్షంలో ఆలయ సిబ్బంది లక్ష్మీరాజం ని కండువాతో సత్కరించి, ఆయన సుదీర్ఘ సేవలను కొనియాడారు.



ఈ కార్యక్రమంలో బాలయ్య డీఈవో భాస్కర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘునందన్,ఏఈఓ శ్రవణ్ కుమార్,జయకుమారి,పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్,రాజు,పూజిత,శివ సాయి,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృదే లక్ష్యంగా పనిచేస్తా

**సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్**



**వాస్తవం : మనోహరాబాద్**

గ్రామ అభివృదే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతానని సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్ అన్నారు.మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామంలో మంగళవారం 1వ,7వ వార్డుల్లో పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సిసి రోడ్డు పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు సూచించారు.గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.పాలకవర్గ సభ్యులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,గ్రామస్తులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు..

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండలం మర్రికుంట తండా గ్రామానికి చెందిన వంటరి మహిళ బానోతు సత్తెమ్మ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజువారీగా పనికి వెళ్లారు.ఆమె ఇంట్లో విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఇల్లు,ఇంట్లో ఉన్న నిత్యవసర సరుకులు, దుస్తులు, నగదు రూపాయలు 25 వేల రూపాయలు దగ్ధమైనాయని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేసారు. సమాచారం అందిన వెంటనే తిరుమలగిరి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజిత్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సత్తెమ్మ ఇల్లు తో పాటు వస్తువులు కాలిపోవడంతో బాధితురాలికి నిత్యవసర సరుకులు అందించి ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించాలని అధికారులను గ్రామ ప్రజలు కోరారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ సంధ్య, గ్రామ పెద్దలు భాస్కర్, రందన్ నాయక్, హరీష్, దేవా, తదితరులు ఉన్నారు.

ఎంపీపీఎస్ కిషన్ దాస్ పేటలో గ్రాడ్యుయేషన్ డే

# వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహణ

వాస్తవం : ఎల్లారెడ్డిపేట




ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్ దాస్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోమంగళవారం గ్రాడ్యుయేషన్ డే మరియు ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టారి సంపత్ కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి కృష్ణ హరి హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతోప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కృష్ణ హరి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి విద్యార్థి మంచి నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. చదువులో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ మాట్లాడుతూ, తమ పాఠశాలలో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులే మొదటి గురువులని, ప్రతి విద్యార్థి వారిని గౌరవించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా పోషకాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేసి తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు. అలాగే 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువులో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ మెడల్స్ ను స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంప నాగేంద్రం అందించారు. వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలగందుల నరసింహులు, మాజీ ఎస్ఎంసీ సభ్యుడు ఒగ్గు మహేష్ చంద్ర, ఉపాధ్యాయులు తుమ్మనపల్లి నరేష్ కుమార్, పంపరి రజిత, మిట్టపల్లి ప్రశాంత్, నీలిమ, రమ్య, రజిని, మాజీ వార్డు సభ్యురాలు ఒగ్గు లక్ష్మి యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# మైనింగ్ ఎడి బారి నుండి కాపాడండి

అన్ని అనుమతులు ఉన్న అడ్డుపడుతున్న వైనం

కాపాడమంటూ కలెక్టర్‌కు వేడుకోలు

వాస్తవం : పెద్దపల్లి జిల్లా ప్రతినిధి




పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంట గ్రామంలోని గంట్ల విజయ్ కుమార్ రెడ్డికి చెందిన సర్వే నెంబర్ 390 మైనింగ్ అనుమతి తీసుకొని మట్టి తవ్వుతుండగా గ్రామస్తులు అడ్డుకుంటున్నారని,జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశానని సనికొమ్ము రామ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో రామ్ రెడ్డి మాట్లాడుతూ పట్టా భూమి నుండి మైనింగ్ అనుమతులు పొంది మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తుండగా వాటిని అడ్డుపడిన తుర్కల మద్దికుంట గ్రామానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు,గ్రామానికి 5 లక్షల రూపాయలు విరాళం ఇవ్వాలని,లేకుంటే టిప్పర్లు నడువనియ్యమని టిప్పర్ల అద్దాలు ధ్వంసం చేసి దౌర్జన్యం చేస్తూ నాకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు ఉన్న మైనింగ్ ఏడి నీ,పోలీసులను పంపించి లారీ టిప్పర్లను సీజ్ చేయించి నా ఉపాధిని అడ్డుకున్నారాని,నేను దివ్యాంగుడనని రెండు కండ్లు కనిపించని వాడని,వికలాంగుడనని నన్ను కనికరించి వారి బారి నుండి కాపాడి వారి మీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని,జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

టాప్రా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్

శంకరపట్నం : వాస్తవం

ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలు పుమేరకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అ సోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ డిమాండ్స్‌కు సంబంధించి భారత ప్రధా నమంత్రి న్యూఢిల్లీ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కొరకు మంగళవారం ఈమెయిల్ ద్వారా డిమాండ్స్‌కు సంబంధించిన మెమోరాండం సమర్పించనైనది. ఈ సందర్భంగా టాప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్ గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ హక్కులకు భంగం కలిగించే వాలిడేషన్ ఆఫ్ పెన్షన్ యాక్ట్ మార్చ్ 20 25 ను కేంద్ర ప్రభుత్వము వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎస్ ఎన్పీఎస్ యుపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సెప్టెంబర్ 2004 తర్వాత నియమింపబడి పదవీ విరమణ పొందిన పెన్షనర్స్ అందరికీ వర్తింపచేయా లని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదేవిధం గా రాష్ట్ర ప్రభుత్వం నూతన పి ఆర్ సి ని జూలై 2023 నుండి అమలుపరుస్తూ పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేస్తూ కోర్టు ఆదేశం మేరకు పెన్షనర్స్ పెన్షన్ నుండి సీవీపీ తగ్గింపును 15 సంవత్సరములకు బదులుగా 11 సంవత్సర ములకు కుదించాలని 29 కార్మిక చట్టాలను రద్దు పరుస్తూ కార్పొరేట్



శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ విధానాలను వెంటనే రద్దు చేస్తూ కార్మికులకు సరైన న్యాయాన్ని చేకూర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

సీనియర్ సిటిజన్స్‌కు

# ఆసరా కార్డుల పంపిణీ

డిపిఓ స్వాతి



వాస్తవం : రాజేంద్రనగర్

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్స్ కి ఆసరా పింఛన్ కార్డులను అందజేశామని రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి డిపిఓ స్వాతి తెలిపారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో కార్డుల పంపిణీకి కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ... ఆసరా కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మొత్తం 60 మంది సీనియర్ సిటిజన్స్‌కు కార్డులను అందజేశామన్నారు. వయోవృద్ధులకు చేయూతనందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అమలుపరుస్తున్న ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం కార్డులు అందుకున్న సీనియర్ సిటిజన్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఓ లక్ష్మణ్, ఆర్పీలు, జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు

కేశవపట్నం బస్టాండ్‌లో ప్రయాణికులకు

# మజ్జిగ పంపిణీ చేసిన ఎంపీడీవో



శంకరపట్నం : వాస్తవం

శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎంపీడీవో గోల్కొండ గోల్కొండ కృష్ణ ప్రసాద్ మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆయన సొంత ఖర్చులతో మజ్జిగ తయారు చేసి పంపిణీ చేశారు. ప్రయాణికులతో పాటు ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బందికి కూడా మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ హనుమంతరావు, కార్గో ఏజెంట్ సురేష్, ప్రయాణికులు పాల్గొన్నారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి, జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# కోతులు పట్టడానికి కౌన్సిలర్లు సహాయం చేయాలి

**బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్**

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ పట్టణంలో రోజురోజుకు కోతుల సమస్య తీవ్రతరం అవుతున్నదని ఈ విషయంలో నూతన కౌన్సిలర్లు 6 నెలల వేతనం సహాయం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ గౌడ్ కోరారు. నిత్యం పట్టణవాసులు కోతులు, కుక్కల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు తమ 6 నెలల గౌరవ వేతనం కోతులు పట్టడానికి సహాయం చేయాలని కోరారు. చాలామంది కౌన్సిలర్లు తాము గెలిస్తే కోతులను పట్టిస్తామని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారని చెప్పారు. ఒక కౌన్సిలర్ కు నెలకు రూ. 3000 చొప్పున ఆరు నెలలకు రూ.18 వేలు మున్సిపల్ నుండి చెల్లిస్తారని, 18 కౌన్సిలర్లకు 6 నెలల గౌరవ వేతనం రూ.3 లక్షల ఇరవై ఆరువేల రూపాయలు అవుతుందన్నారు. అదేవిధంగా మునిసిపల్ చైర్ పర్సన్ కు రూ.1 లక్ష వరకు ఆరు నెలలకు చెల్లిస్తారు. అదేవిధంగా వైస్ చైర్మన్ కు రూ.78,000 చెల్లిస్తారని, ఇట్టి గౌరవ వేతనం హుస్నాబాద్ మున్సిపల్



ఆదాయం నుండే చెల్లిస్తారు కాబట్టి అందరూ ముందుకు రావాలన్నారు. అదేవిధంగా పాత పాలకవర్గం కు 6 నెలల గౌరవ వేతనం మున్సిపల్ నుండి చెల్లించవలసి ఉంది. వారికి కూడా రూ.6 లక్షల రూపాయలు బకాయిలు ఉందని, హుస్నాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్ లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా పరిస్థితులను అర్థం చేసుకుని పట్టణ ప్రజల కొరకు నూతన కౌన్సిలర్లు,చైర్మన్,వైస్ చైర్మన్ పాత పాలకవర్గం తమ గౌరవ వేతనం సహాయం చేయాలని, పట్టణ ప్రజల ఇబ్బందులు వీటి నుండి తొలగించాలని బీఎస్పీ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

# అనుమతి లేని బోర్ లారీ సీజ్




**వాస్తవం : చిగురుమామిడి**

మండలంలోని నవాబు పేట గ్రామానికి చెందిన బోయిని లక్ష్మి అనే మహిళా రైతు వ్యవసాయ భూమి సర్వే నంబర్ 735,736ఇ వ్యవసాయ భూమి పక్కన గల మరో రైతు కూతురు రవీందర్ రెడ్డి అనుమతి లేకుండా గత వారం రోజులుగా వ్యవసాయ బావి తవ్వకం మొదలుపెట్టి సైడ్ బోర్లు వేయడానికి ఈ నెల 19 తారీఖు ఆదివారం రోజున బోరు లారీ తీసుకొచ్చి సంబంధిత శాఖ అనుమతి తీసుకోకుండా సైడ్ బోర్లు వేయించగా గమనించిన దళిత వర్గానికి చెందిన మహిళా రైతు లక్ష్మి సోమవారం చిగురుమామిడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తహశీల్దార్ ఎం రమేష్ ఆదేనుసారం మంగళవారం బావి తవ్వకాలు జరుపుతున్న వ్యవసాయ భూమి వద్దకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు,జిపిఓ శ్రీనివాస్ వెళ్లి పరిశీలించి బోరు లారీని సీజ్ చేశారు.

# అభిషేక్ బ్యాటుతో, మలింగ బంతితో

## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హ్యాట్రిక్

సొంతగడ్డపై వరసగా మూడో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్) సుడిగాలి శతకంతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై మానసికంగా పైచేయి సాధించిన హైదరాబాద్.. ఇషాన్ మలింగ(4-32) విజృంభణతో ఘన విజయం సాధించింది. పవర్ హిట్టర్లతో నిండిన ఢిల్లీలో నితీశ్ రానా(57) అర్ధ శకతంతో పోరాడినా.. మిడిలార్డర్ మెరవలేదు. ఆఖర్లో హర్ష్ దూబే(3-12) తిప్పేయగా 195కే ఢిల్లీ ఫలితంగా పరిమితమవ్వగా.. ఇషాన్ సేన హ్యాట్రిక్ విజయం, ఎనిమిది పాయింట్లతో ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది.ఐపీఎల్-19లో సన్‌రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ విజయంతో సొంత ప్రేక్షకులను అలరించింది. ఉప్పల్ స్టేడియంలో ఓపెనర్ అభిషేక్ శర్మ (135 నాటౌట్) ఊచకోతతో భారీ స్కోర్ కొట్టిన





సన్‌రైజర్స్‌ను బౌలర్లు మళ్లీ నిలబెట్టారు. తొలి మ్యాచ్ ఆడుతున్న మధుషంక ఓపెనర్ పథుమ్ నిశాంక(8)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, నితీశ్ రానా (57), కేఎల్ రాహుల్(37) దూకుడుగా ఆడి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. స్పిన్నర్లు, పేసర్లను దీటుగా ఎదుర్కొన్న రానా బౌండరీలతో భయపెట్టాడు. శివాంగ్ ఓవర్లో రెచ్చిపోయిన అతడు అర్ధ శతకంతో ఆశలు రేపినా. ఇషాన్ మలింగ(4-34) ఢిల్లీకి 11వ ఓవర్లో షాకిచ్చాడు. వరస బంతుల్లో రానాను, సూపర్ డెలివరీతో డేవిడ్ మిల్లర్(0)ను బౌల్డ్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. హ్యాట్రిక్ బంతికి వికెట్ కాపాడుకున్న ట్రిస్టన్ స్టబ్స్(27).. సమీర్ రిజ్వీ()తో.. అప్పటికే అవసరమైన నెట్ రన్‌రేటు 15 దాటింది. రివర్స్ స్కూప్ షాట్లు ఆడుతూ బౌండరీలు సాధిస్తున్న స్టబ్స్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. దాంతో, ఐదో వికెట్‌కు 59 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది. 18 బంతుల్లో 66 రన్స్ అవసరమవ్వగా.. మలింగ ఓవర్లో అనికేత్ క్యాచ్‌తో ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(14) పెవిలియన్ చేరాడు. అక్షర్ పటేల్ (2)సైతం విఫలమవ్వగా సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.

# రేవంత్‌వి చిల్లర మాటలు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. రైతుబంధును ఎగ్గొట్టారని.. గురుకులాలను నిర్వీర్యం చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా, ఆంధ్రా నాయకుల చేతిలో కీలుబొమ్మలా మారాడని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని అన్నారు. 2015లో ఇదే టీడీపీ నుంచి వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయాలని చూసి, ఓటుకు నోటులో దొరికాడని గుర్తుచేశారు.నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి సోయి లేకుండా మాట్లాడుతున్నాడని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ మద్దతుగా నిలిచిందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల భాస్కరరావును మంత్రి పదవి నుంచి తొలగించినప్పుడు, ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తనను ఎవరూ మంత్రి పదవి నుంచి తొలగించలేదని.. తానే రాజీనామా చేశానని స్పష్టం చేశారు. తాను మాత్రమే కాదని.. ఆ రోజు ఇందిరా గాంధీ, కాంగ్రెస్ పార్టీ మొత్తం నాదెండ్ల భాస్కరరావుకు మద్దతుగా నిలిచిందని తెలిపారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదని అనుకుంటా అని విమర్శించారు.

# తెలంగాణ నుంచి 8 కొత్త రైళ్లు

**రైల్వేశాఖ ప్రకటన..**
**కిషన్‌రెడ్డి హర్షం**
**ఇప్పటిదాకా ఈ ప్రత్యేక రైళ్లన్నీ ఇక రెగ్యులర్ రైళ్లు**
**రైల్వే అధికారుల వెల్లడి**

**న్యూఢిల్లీ:** రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని వివిధ స్టేషన్ల నుంచి ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి ఏపీలోని తిరుపతి, తిరుచానూరు, రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, జైపూర్, ఒడిశాలోని భువనేశ్వర్‌కు కొత్త రైళ్లను నడనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ తెలిపిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వీటిలో తిరుపతి, తిరుచానూరు వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకోసం 5 రైళ్లు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. దీంతోపాటుగా భువనేశ్వర్, జైపూర్, శ్రీగంగానగర్ వంటి సుదూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు లబ్ధి చేకూరనుంది. రైల్వే శాఖ నిర్ణయం పట్ల ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా ఇప్పటికే ఈ ప్రత్యేక రైళ్లు ఆయా ప్రాంతాల నుంచి నడుస్తున్నాయని, ఈ ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ రైళ్లుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయించిందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ



ప్రత్యేక రైళ్లు రెగ్యులర్ రైళ్లుగా మారడంతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారం ఉండదని వెల్లడించారు.